పద్మావతి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లలో చోరీ

- మహిళల మెడలోని బంగారు ఆభరణాల అపహరణ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వే ఎస్పీ షేక్ సలీమా

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ షేక్ సలీమా

చింతకాని, జూన్ 13 : విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో చింతకాని రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలిసింది. సిగ్నల్ ట్యాంపరింగ్ చేసిన దుండగులు మచిలీపట్నం నుంచి బీదర్ వెళ్తున్న మచిలీపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని 8 బోగీల్లోకి తెల్లవారుజామున ప్రవేశించారు. ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్న సమయంలో మహిళల మెడలో నుంచి బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు సమాచారం. దీనిపై పలువురు బాధితులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్పీ షేక్ సలీమా, రైల్వే, సివిల్ ఏసీపీలు కృపాకర్, రెహమాన్, సీఐలు నూనావత్ సాగర్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు షేక్ నాగుల్ మీరా, పి.భాస్కర్‌రావు, సిబ్బంది ఘటనా స్థలాన్ని గురువారం సందర్శించారు. రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ పుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. దీనిపై రైల్వే, పోలీసు అధికారులు పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది.

రూ.75లక్షల విలువైన గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

గంజాయి నిందితులతో పోలీసులు, ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ పోలీసులు

కొత్తగూడెం క్రైం, జూన్ 13: రూ.75లక్షల విలువైన గంజాయిని కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు గురువారం స్వాధీనపర్చుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ తెలిపిన వివరాలు.. గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారంతో వన్ టౌన్ ఎస్సై విజయ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం వేళ ముగ్గురు వ్యక్తులు టీఎస్17జె 4458 నంబరుగల స్విఫ్ట్ డిజైర్ కారులో అనుమానాస్పదంగా కనిపించారు. ఆ కారును పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందులో రూ.75లక్షలు విలువైన 186 కేజీల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కారులో ఉన్న వారిని కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేటకు చెందిన పెనుగొండ నరసింహులు, కుంచం లక్ష్మణ్, నంది తండాకు చెందిన భూక్యా లక్ష్మణ్‌గా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి అటవీ ప్రాంతంలో గంజాయిని కొని, మహారాష్ట్ర షోలాపూర్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వారు చెప్పారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కోర్టు ఆదేశంతో రిమాండుకు తరలించారు. గంజాయి రవాణాను అడ్డుకున్న సీసీఎస్, వన్ టౌన్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అభినందించారు.

రూ. 3లక్షల విలువ గల గంజాయి పట్టివేత

- రూ. 2లక్షల బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం

భద్రాచలం, జూన్ 13: వరంగల్‌లో ఫొటోగ్రాఫర్లుగా ఉంటూ జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ ఖమ్మం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులకు గురువారం పట్టుబడ్డారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన రేకుల సాయికుమార్, పెద్దపల్లి జిల్లా కొలనూర్‌కు చెందిన ఏకుల సజన్ కుమార్ వరంగల్‌లో ఫొటోగ్రాఫర్లుగా పనిచేస్తూ గంజాయి మత్తుకు అలవాటు పడ్డారు. గంజాయిని కొనే స్థోమత లేకపోవడంతో గంజాయిని అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధపడ్డారు. వరంగల్ నుంచి భూపాలపల్లికి వెళ్లి అక్కడ మండల కుమార్ అనే స్నేహితుడి వద్ద బైక్ తీసుకున్నారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా రవులకు వెళ్లి అక్కడ 7.300కేజీల గంజాయిని కొనుగోలు చేసి భద్రాచలం వస్తుండగా స్థానిక కూనవరం రోడ్డులో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల తనిఖీలో పట్టుపడ్డారు. వారిని విచారించగా వరంగల్‌లో గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వెళ్తున్నామని తెలిపారు. వారి వద్ద రెండు సెల్‌ఫోన్లను బైక్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 3లక్షలు, బైక్ విలువ రూ. 2లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. తనిఖీల్లో వెంకట్, హనుమంతరావు, సుధీర్, బాలు, కరీం, విజయ్, హరీష్ పాల్గొన్నారు. గంజాయిని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు.

ఉనికి కోసమే విధ్వంసక చర్యలు

- ఆదివాసీల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా బూబీట్రాప్స్
- 58 బూబీట్రాప్స్ నుంచి 3,350 కడ్డీల వెలికితీత
- ప్రకటన విడుదల చేసిన జిల్లా పోలీసు శాఖ



బూబీట్రాప్స్‌ని వెలికి తీసిన భద్రతా దళాలు

కొత్తగూడెం క్రైం/చర్ల, జూన్ 13 : తమ ఉనికిని చాటుకునేందుకు.. ఏజెన్సీ ప్రాంతాల్లో విధ్వంసక చర్యలకు పాల్పడేందుకు మావోయిస్టులు పూనుకుంటున్నారని, బూబీట్రాప్స్‌ని అమర్చి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని భద్రాద్రి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదలైంది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన పూసగుప్ప అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలు అడవుల్లోకి వెళ్లాలంటే మావోయిస్టులు పెడుతున్న మందుపాతర వల్ల తమకు ప్రాణహాని ఉన్నదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీస్ బలగాలు ఆయా అటవీ ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి.. బూబీట్రాప్స్‌ను వెలికి తీసినట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. మావోయిస్టులు 58 ప్రాంతాల్లో గుంతలు తవ్వి అమర్చిన 3,350 పదునైన కడ్డీలను వెలికి తీశామని పేర్కొన్నారు. నిషేధిత మావోయిస్టు పార్టీ నాయకులు ఆదివాసీలకు మంచి చేస్తున్నట్లు మాయమాటలు చెబుతూ వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా చేస్తున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు మావోయిస్టుల దుశ్చర్యల వల్ల నిత్యం బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆదివాసీలు, జంతువులు సంచరించే ప్రాంతాల్లో వారు అమర్చిన ఐఈడీలు, బూబీట్రాప్స్ అమర్చడం వల్ల ఇప్పటికే చాలా మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు గాయాల పాలయ్యారని పేర్కొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎదురు కాల్పులు జరిగినప్పుడు నిజనిర్ధారణ పేరుతో హడావిడి చేసే ప్రజా సంఘాలు.. ఆదివాసీల పట్ల జరిగే అన్యాయాల పట్ల ఎందుకు నివసించే ఆదివాసీలు ప్రశ్నించడం లేదని ప్రశ్నాస్త్రం సంధించారు. మావోయిస్టులు ఉన్న ప్రాంతాలను శత్రు దుర్భేద్యం పేరుతో, పోలీసుల నుంచి రక్షణ అని చెబుతూ 'జల్ జంగల్ జమీన్' నినాదంతో జీవనం సాగించే అమాయక ఆదివాసీ, గిరిజన ప్రజ లను నివారించడానికి బూబీట్రాప్స్, ఐఈడీలను అమర్చుకొని ఆయా ప్రాంతాల్లో రక్షణ కరువయ్యేలా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వానికి ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా పోలీస్ శాఖ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

కొత్తగూడెంలో రేపు జాబ్ మేళా

మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత

కొత్తగూడెం టౌన్, జూన్ 13 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 15న ఉదయం 10.30 గంటలకు తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి విజేత తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చేసిన నిరుద్యోగులకు అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్టు వంద పోస్టులు(నెలకు రూ.16,300 నుంచి రూ.25 వేల వేతనం), ట్రైనీ ఫార్మాసిస్టు వంద పోస్టులు(నెలకు రూ.14,800 నుంచి రూ.20 వేల వరకు వేతనం) ఉన్నట్లు పేర్కొన్నారు. సాయి అంజనా మోటార్స్‌లో మార్కెటింగ్ టీం లీడర్ (డిగ్రీ, వేతనం రూ.10 వేల నుంచి రూ.15 వేలు), మోకానిక్స్-5 (వేతనం రూ.10 వేల నుంచి రూ.12 వేలు), మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 10 పోస్టులకు (పదో తరగతి పాస్) వేతనం రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉంటుందని వివరించారు. ఆయా ఖాళీలు హైదరాబాద్, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు తదితర ప్రదేశాల్లో ఉంటాయని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వయసులో పదేళ్ల పడలింపు ఉంటుందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు..

కిడ్నీలు దెబ్బతిని ప్రాణాపాయ స్థితిలో నిరుపేద యువకుడు

ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఆర్థిక సాయం కోసం వేడుకోలు

ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న యువకుడు రాజా

రఘునాథపాలెం, జూన్ 13: మండలంలోని వేపకంపట్ల గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు అనుబోతు రాజా (20) కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండు కిడ్నీలూ దెబ్బతినడంతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆర్థిక సాయం అందించి తన కొడుకును బతికించాలని ఆ నిరుపేద యువకుడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వేపకంపట్ల గ్రామానికి చెందిన అనుబోతు రాజా డిగ్రీ పూర్తి ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత ఏడాది పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో పాల్గొనే సమయంలో నిత్యం తీవ్రమైన తలనొప్పితో బాధపడేవాడు. నొప్పి నివారణ కోసం పెయిన్ కిల్లర్స్ వినియోగించేవాడు. ఎంతకీ ఫలితం లేకపోవడంతో వైద్యులను సంప్రదించగా వైద్యులు రెండు కిడ్నీలూ దెబ్బతిన్నట్లు చెప్పారు. ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన రాజా.. విషయాన్ని తన తల్లిదండ్రులు శ్రీను, నాగమణిలకు తెలియజేశాడు. అనంతరం హైదరాబాద్ ఆసుపత్రిలో చేరాడు. కొడుకుని బతికించుకునేందుకు తల్లిదండ్రులు ఉన్న ఆస్తులన్నీ విక్రయించి చికిత్స చేయించారు. ఫలితం లేకపోగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు తేల్చారు. అందుకు రూ.15 లక్షలు అవసరమని చెప్పారు. దీంతో దిక్కుతోచక ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొడుకు వైద్యానికి దాతలెవరైనా ఆర్థిక సాయం అందించి బతికించాలని వేడుకుంటున్నారు. 9666515928 నంబరును సంప్రదించాలని కోరుతున్నారు.

బిగ్'సి'లో గెలాక్సీ ఏఐ సూపర్ సేల్

హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ రిటైల్ మొబైల్ విక్రయ సంస్థ బిగ్'సి' షోరూంలో సామ్‌సంగ్‌నకు చెందిన గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లు ఈ నెల 14 నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా బిగ్'సి' ఫౌండర్, సీఎండీ బాలు చౌదరి మాట్లాడుతూ..సామ్‌సంగ్ గెలాక్సీ ఏఐ సిరీస్ ఫోన్లను సూపర్ సేల్‌లో భాగంగా శుక్రవారం నుంచి అన్ని రిటైల్ స్టోర్లలు అందుబాటులోకి తేనున్నట్లు, అత్యంత అధునాతనమైన ఫీచర్లతో రూపొందించిన ఈ మొబైల్ ప్రారంభ ధర రూ.39,999గా ఉందని చెప్పారు. ఈ మొబైల్‌ను కొనుగోలు చేసిన వారికి జీరో డౌన్ పేమెంట్, 24 నెలల్లో నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మొబైల్ కొనుగోలుపై రూ.16 వేల వరకు ఇన్‌స్టంట్ క్యాష్ బ్యాక్, రూ.18 వేల వరకు ఎక్స్చేంజ్ బోనస్ వంటి ఆకర్షణీయమైన ఆఫర్లు లభిస్తాయని వివరించారు.

పంచ్, నెక్సాన్ ఈవీలు సురక్షితమైనవి..

న్యూఢిల్లీ, జూన్ 13: దేశీయ ఆటో మొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటార్స్‌కు చెందిన పంచ్.ఈవీ, నెక్సాన్.ఈవీలకు భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రొగ్రామ్(భారత్-ఎన్‌సీఏపీ) 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది. దేశీయ ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఈ రెండు కార్లు అత్యంత సురక్షితమైనవని, అందుకోసం టాటా మోటార్స్‌ను అభినందిస్తున్నానని ఎక్స్‌లో కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

సువెన్ చేతికి సపలా

హైదరాబాద్, జూన్ 13: సువెన్ ఫార్మాస్యూటికల్స్..సపలా ఆర్గానిక్స్‌లో 67.5 శాతం వాటాను కొనుగోలు చేయబోతున్నది. ఒప్పందం విలువ రూ. 229 కోట్లు. ఈ సందర్భంగా సపలా ఫౌండర్ ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. వ్యూహాత్మక వ్యాపార భాగస్వామి సువెన్‌తో కలిసి మరింతగా విస్తరించనున్నట్లు, భవిష్యత్తు వృద్ధికి ఈ వాటా విక్రయం తోడ్పాటునందించనున్నదన్నారు.

డాలర్ ప్రచారకర్తగా మహేశ్ బాబు

హైదరాబాద్, జూన్ 13: ప్రముఖ దుస్తుల సంస్థ డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తాజాగా తెలుగు నటుడు మహేశ్ బాబును ప్రచారకర్తగా నియమించుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ వినోద్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాల్లో విక్రయాలు 50 శాతం వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఇందుకోసం 50 ఔట్‌లెట్లను ప్రారంభించబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

ఎఫ్‌టీసీసీఐ అవార్డులకు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌టీసీసీఐ వార్షిక ఎక్సలెన్స్ అవార్డుల కోసం అర్హులైన పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆన్‌లైన్ ద్వారా ఎఫ్‌టీసీసీఐకి నామినేషన్లు పంపించేందుకు ఈ నెల 20 చివరి గడువు అని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మేలా జయదేవ్ తెలిపారు. ఎగుమతులు, మార్కెటింగ్, నూతన ఆవిష్కరణలు, ఆర్ అండ్ డీ టెక్నాలజీ తదితర 21 విభాగాల్లో విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

పేటీఎంతో సామ్‌సంగ్ దోస్తీ

గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులు

న్యూఢిల్లీ, జూన్ 13: డిజిటల్ పేమెంట్స్ యాప్ పేటీఎంతో సామ్‌సంగ్ జట్టు కట్టింది. దేశీయంగా తమ సామ్‌సంగ్ వాలెట్‌కు ట్రావెల్, ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులను జత చేసేలా పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నది. పేటీఎం సహకారంతో ఇక సామ్‌సంగ్ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు సామ్‌సంగ్ వాలెట్ ద్వారా విమాన, బస్ టికెట్ల బుకింగ్, సినిమా టికెట్ కొనుగోళ్లు, ఈవెంట్ బుకింగ్స్ చేసుకోవచ్చు. గెలాక్సీ స్టోర్ నుంచి ప్రస్తుత సామ్‌సంగ్ వాలెట్ యూజర్లు తమ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా ఈ కొత్త సర్వీసులను అందుకోవచ్చు.

అంబుజా చేతికి పెన్నా

మరో సంస్థను హస్తగతం చేసుకున్న అదానీ గ్రూప్

లావాదేవీ విలువ రూ.10,422 కోట్లు

సిమెంట్ ఇండస్ట్రీ ఆధిపత్యంపై గౌతమ్ అదానీ కన్ను

కంపెనీల కొనుగోలుకు రూ.25,000 కోట్లతో నిధి

- 1991లో పెన్నా సిమెంట్‌ను స్థాపించారు.
- 1994 ఆగస్టు 10న అనంతపురం జిల్లా తలారిచెరువు వద్ద తొలి ప్లాంట్ ఏర్పాటు.
- ఏపీ, తెలంగాణ, రాజస్థాన్‌లలో ప్లాంట్లు.
- ఈకంపెనీకి 3 ప్యాకేజింగ్ టర్మినళ్లు, 2 గ్రైండింగ్ యూనిట్లు, 4 ఇంటిగ్రేటెడ్ ప్లాంట్లున్నాయి.
- ప్రస్తుత వార్షిక ఉత్పాదక సామర్థ్యం 10 మిలియన్ టన్నులు.
- కృష్ణపట్నం, జోధ్‌పూర్‌లలో 2 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో 2 ప్లాంట్లు రాబోతున్నాయి. మరో 6-12 నెలల్లో వీటి నిర్మాణం పూర్తవుతుంది. అప్పుడు సంస్థ వార్షిక సిమెంట్ ఉత్పాదక సామర్థ్యం 14 మిలియన్ టన్నులకు చేరుతుంది.
- 'పెన్నా సురక్ష' పేరిట ఆసియాలోనే అతి పెద్ద సెల్ఫ్ డిశ్చార్జ్ సిమెంట్ రవాణా నౌక పెన్నా సిమెంట్‌కు ఉన్నది. ఇది 25వేల మిలియన్ టన్నుల సిమెంట్‌ను తీసుకెళ్ల గలదు. డిశ్చార్జ్ కెపాసిటీ గంటకు వెయ్యి టన్నులు.
- పెన్నా సిమెంట్‌తో అదానీ గ్రూప్ శ్రీలంక మార్కెట్లోకి ప్రవేశిస్తున్నది. అక్కడ పెన్నా ఓ సిమెంట్ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నది.

హైదరాబాద్, జూన్ 13: గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్.. మరో సంస్థను హస్తగతం చేసుకున్నది. అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ గురువారం పెన్నా సిమెంట్‌ను పూర్తిగా కొనేసింది. కంపెనీ విలువను రూ.10,422 కోట్లుగా లెక్కగట్టి ఈ లావాదేవీని జరిపింది. ఈ మేరకు అంబుజా సిమెంట్ బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ)కు తెలియజేసింది. నగదు రూపంలోనే డీల్ ఉన్నట్లు తెలుస్తున్నది. కాగా, పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీసీఐఎల్)తో బైండింగ్ అగ్రిమెంట్‌పై సంతకాలు జరిగాయని చెప్పింది. దీంతో పీసీఐఎల్ 100 శాతం వాటాలు దాని ప్రస్తుత ప్రమోటర్ గ్రూప్, పీ ప్రతాప్ రెడ్డి, ఆయన కుటుంబం నుంచి అంబుజా చేతికి రానున్నాయి. ఇక ఈ డీల్‌తో పెన్నా డీలర్లరంతా అంబుజా సిమెంట్ మార్కెట్ నెట్‌వర్క్‌లోకి వస్తున్నారు.

దక్షిణాదిపై పట్టు

పెన్నా సిమెంట్ కొనుగోలుతో అదానీ గ్రూప్ దక్షిణాది మార్కెట్ షేర్ మరో 8 శాతం పెరిగింది. ఇప్పటికే అంబుజా, ఏసీసీ సిమెంట్లతో దేశవ్యాప్తంగా సిమెంట్ ఇండస్ట్రీలో బలమైన కార్పొరేట్ శక్తిగా గౌతమ్ అదానీ ఎదిగారు. అయినప్పటికీ భారత్‌లో అల్ట్రాటెక్ తర్వాతి స్థానంలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో పెన్నా సిమెంట్ డీల్.. దేశీయ సిమెంట్ పరిశ్రమలో అదానీ వాటాను ఇంకో 2 శాతం పెంచింది. నిజానికి భారతీయ సిమెంట్ ఇండస్ట్రీలో అగ్రస్థానంపైనే అదానీ కన్నేశారు. ఇందు కోసం 3 బిలియన్ డాలర్ల (రూ.25,000 కోట్లు)తో ఓ నిధిని కూడా పక్కకు పెట్టుకున్నారు. ఇక పీసీఐఎల్‌కు వ్యూహాత్మక ప్రాంతాల్లోనే ప్లాంట్లున్నాయి. దీనికి కావాల్సినంత సున్నపురాయి నిల్వలూ ఉన్నాయి. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సిమెంట్‌ను ఉత్పత్తి చేయడానికి పుష్కలంగా అవకాశాలున్నాయని అదానీ గ్రూప్ చెప్తున్నది.

సిమెంట్ గిరాకీకి తగ్గట్టుగా..

భారతీయ సిమెంట్ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నది. ఈ నేపథ్యంలోనే రాబోయే ఐదేండ్లకుపైగా కాలంలో వార్షిక చక్రవృద్ధి రేటు (సీఏజీఆర్) 7 నుంచి 8 శాతంగా ఉండొచ్చని అదానీ గ్రూప్ అంచనా వేస్తున్నది. దేశవ్యాప్తంగా రైల్వే సైడింగ్స్, క్యాపిటివ్ పవర్ ప్లాంట్లు, వేస్ట్ హీట్ రికవరీ సిస్టమ్స్‌తోపాటు సాగునీటి ప్రాజెక్టులు, నివాస సముదాయాలు, రహదారుల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీనికి తగ్గట్టుగానే చిన్న, పెద్ద సిమెంట్ కంపెనీలను చేజిక్కించుకోవాలని అదానీ గ్రూప్ ప్రయత్నిస్తున్నది. తద్వారా మార్కెట్‌లోనూ ఆధిపత్యం కొనసాగించాలనుకుంటున్నది. అంబుజా, ఏసీసీ, సంఘీ ఇండస్ట్రీస్‌ల వార్షిక ఉత్పాదక సామర్థ్యం ఇప్పుడు 78.9 మిలియన్ టన్నులుగా ఉన్నది. దేశవ్యాప్తంగా వీటికి 18 ప్లాంట్లు, 19 గ్రైండింగ్ యూనిట్లున్నాయి. తాజాగా పెన్నా సిమెంట్‌నూ పొందడంతో మొత్తం అదానీ గ్రూప్ ఆధ్వర్యంలోని సిమెంట్ సంస్థల వార్షిక ఉత్పాదక సామర్థ్యం 89 మిలియన్ టన్నులకు చేరుతున్నది. అలాగే కోల్‌కతా, గోపాల్‌పూర్, కరైకల్, కొచ్చి, కొలంబోల్లోని బల్క్ సిమెంట్ టర్మినల్స్‌తో అదానీ సిమెంట్ సముద్ర రవాణా సామర్థ్యం బలపడింది.

వాణిజ్య

అంబుజా సిమెంట్ వృద్ధిదాయక ప్రయాణంలో పెన్నా సిమెంట్ కొనుగోలు కీలక మైలురాయి. ఈ డీల్‌తో దేశంలో మా సిమెంట్ వ్యాపారం మరింత విస్తరించడమేగాక, బలపడినట్లైంది. విలువ, ఉత్పత్తిపరంగా పీసీఐఎల్‌ను అత్యంత పోటీయత సంస్థగా తీర్చిదిద్ది, దాని పనితీరును మెరుగుపర్చడమే మా లక్ష్యం.

-అజయ్ కపూర్,
అంబుజా సిమెంట్ సీఈవో

మైక్రోసాఫ్ట్-బీవోబీ జనరేటివ్ ఏఐ హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్, ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ హ్యాకథాన్‌ను నిర్వహిస్తున్నది. బ్యాంకింగ్ రంగంలో నిర్దిష్ట వ్యాపార రంగాల కొరకు జనరేటివ్ ఏఐ సాంకేతికతను ఉపయోగించి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా హ్యాకథాన్ ఏర్పాటు చేస్తున్నది. ఉత్తమ ఆలోచనలతో వచ్చిన విద్యార్థులు, డెవలపర్లు, వృత్తి నిపుణులు, స్టార్టప్ సంస్థలకు పారితోషికాన్ని అందించనుంది. ఉత్తమమైన మూడు ఆలోచనలను ఎంపిక చేసి తొలి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ. 2 లక్షలను బీవోబీ అందించనున్నది. ఈ నెల 27 వరకు ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునేందుకు https://bobhackathon.com సందర్శించి పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్యాంకింగ్ రంగానికి టెక్నాలజీ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నదని బీవోబీ ఈడీ సంజయ్ ముదలియార్ అన్నారు. అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో బీవోబీ ముందు వరుసలో ఉంటున్నదని, ఏఐ, జనరేటివ్ ఏఐతో బ్యాంకింగ్ రంగంలో సమూలమైన మార్పు లు రాబోతున్నట్లుగా స్పష్టం చేశారు.

ఈనెల 22న జీఎస్టీ కౌన్సిల్ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 13: ఈ నెల 22న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కాబోతున్నది. 53వ సారి జరుగుతున్న ఈ సమావేశం నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న తొలి సమావేశం కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రధానంగా ఈ సమావేశంలో ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ విధింపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నది.

రికార్డుస్థాయికి సూచీలు

ముంబై, జూన్ 13: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ధరల సూచీ తగ్గుముఖం పట్టడంతో వచ్చే సమీక్షలోనే రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో మదుపరుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. దీంతో కొనుగోళ్లకు మద్దతు పలుకడంతో దేశీయ సూచీలు మరో చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకాయి. ఒక దశలో 77,145 పాయింట్లను తచ్చాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 204.33 పాయింట్ల లాభంతో 76,810.90 వద్ద నిలిచ